# సినిమాకు నీతిచంద్రిక



హోరి మీ! మీ నికార్సైన అభిప్రాయాలు బజార్న పడా! ఎంతమాట సెలవిచ్చారుసార్, రైటేసుకోండి. సినీలోకరీతిమీద జారీ అయినట్టి నీతిచంద్రిక ఇంటరెస్టింగానే ఉందిగాని. అచ్చుతప్పులున్నాయిగదూ? అదే... ఒక్కొక్క స్టారు సాలు కారు పిక్చర్లకన్న నటించకూడదని పడింది— ౨౫ బదులు. హాసిల్లీ! ఆరుపిక్చర్లలో వేస్తే ఇండస్ట్రీ బతికి నట్టేనా అంట. స్టార్లకి కాన్సెన్ట్రేషను జాస్తిఅయిపోదూ! ఇప్పుడే కథలు అంతమాత్రంగా ఉంటున్నాయి. డైలాగులు వీళ్ళ నిముడ్చుకోలేక పిగిలిపోతున్నాయి. స్టార్లు ఆట్టే ఆలోచించకుండానే ఎన్నో సంస్కరణలు చేస్తున్నారు.

రేపొద్దున్న తక్కువ పిక్చర్లలోవేస్తే ఇంకా దుంప తెంపె య్యరూ. కథగురించి నిజంగా ఆలోచించెయ్యరూ? వేషం రీలుకెన్నేసి ఫ్రేముల్లో ఉందో చూసుకుందికి మాత్రమే తీరికున్నవాళ్ళు రేప్రొద్దుట్నించీ అడుగడుగునా మంచేవిటి చెడ్డేవిటి తలేవిటి తోకేవిటి కథేవిటికమామీషేవిటనితగులు కోరూ. హమ్మో! కొంపలు మునిగిపోతాయి. అలాగె ఇంకో వెకిలిరాతకూడా ఉంది. స్టార్లు తమక్కావలసిన వాళ్ళచేతే మేకప్పు వేయించుకుంటామని పట్టుబట్టకూడ దుష. ఇంకానయం. కారెక్టరికి తగ్గట్టే వేషం వేయించుకు తీరాలన్నారుగాదు.. ఏమో ఏంచెప్పగలం రేపొద్దున్న లేవగానే, "—అంతేకాదు పాత్రకి తగిఉంటేనే వేషం వెయ్యాలి" అని శాసించినా శాసిస్తారు, వాళ్ళ సామ్రాం పాయె.

ప్రొడ్యూసర్ల గురించి మటుకు మీరు మంచిముక్క చెప్పారు. తగినంత కారణం లేందే డబుల్ వర్షను తీయ కూడదని.... సింగిలు వర్షను చిత్రాలన్నిటికీ తగినంత కారణా లుంటున్నాయని ఎంత గడుసుగా ఒప్పుకున్నారూ. షాశారూ, రచన అంటే అలా వుండాలి. ఒక్క వాక్యం చాలు, గంగిగోవుపాలు అన్నట్లుగా. మెచ్చుకోవల్సించోట నేను కుండబద్దలు కొట్టినట్టు మెచ్చేసుకుంటాను. అది నా దుర్గుణం. ఏంచేస్తాం. పేచీ అల్లా ఇదో ఈ స్టార్లదగ్గరే.

మరేంలేదు. ఒహపక్కనించి కొత్తవాళ్లు రావా లోయ్ అంటూ మహోహాపక్క ఉన్నవాళ్ల కిలాటివి నూరి

పోస్తే యలాగా అంటా. ఇవి నూరిపొయ్యడమూ, మరో పక్క నూరిపోయాల్సిన నూరు హంశాలగురించి అసలు మాటైనా ఎత్తకపోడవ్వూను. దారుణంగాదూ!

ఏదీ! కొందరు హీరోలూ హీరోయిన్లూ అయికమత్యానికి ఆనామం పెట్టేసి, వేళకి షూటింగుకొచ్చేయడం తప్పని దుయ్యబట్టరేం? చక్కగా పదకొండింటికొచ్చి, ఆకలేస్తోందని పన్నెండున్నరకి చెక్కేసేవాళ్ళ అడుగుజాడల్లో వీళ్ళంతా వెళ్ళేరేవిటని నిల్దీసి అడగరేం? లాం వాక్కుంతయు లేదు అంటూ, చిక్కిపోతున్నవాళ్ళని పట్టుకు చీవాట్లెయ్యరేం?....

* * *

యాక్టింగుకేం లెండి పేరుగురించిగదా అనేవాళ్ళకసలీ శాల్తీలగురించి పట్టింపేల? డబ్బింగు సినిమా వాళ్ళ పద్ధతులు అందరూ ఎందుకు పట్టుకు వేళ్ళాడరు? అహ తెలీకడుగుతాలెండి. డబ్బింగువాళ్ళు అరవ సినిమా కథ, మాటలూ రాసినవాడి పేరుని ఎంత చక్కగా తెనిగిస్తున్నారు తెలుగులోకి? అసలు వాడిగుట్టు మనికి తెలియనిస్తున్నారా? అలాగే అరవపిక్చరుకి పాటలు చేసిన మ్యూజిక్కు డైరెక్టరు పేరుని, తెలుగులో రీరికార్డింగు చేసినవాడి పేరులోకి ఎంత షోగ్గా తర్జుమా చేస్తున్నారూ? అక్కడితో ఆగిపోతారేవీ అని. అందులో శివాజీగణేశనూ పద్మినీ నటిస్తే పబ్లిసిటీలో రామారావూ అంజలీదేవీ ఆపేర్లని ట్రాన్స్లేట్ చేసి అఘోరించవచ్చుగా? తిన్నగా తెలుగులో

తీసేవాళ్ళుకూడా అంజలీ రామారావుల పేరుగురించేగా బెంగెట్టుకున్నదీ. వాళ్ళ ప్రజ్ఞని యలాగా వాడుకోదల్చుకో లేదుగా? అంచేతిలా చేస్తే చక్కా హా ఫలానాదీ డబ్బింగు సినిమా అయినట్టు మూడోవాడికి తెలీదు. ఇటు తెలుగు పేర్లూ ఉంటాయి.

ఇదేస్కీము టెల్గూ పిక్చర్లలోకూడా వాడుకోవచ్చు. కాల్షీట్లు ఇవ్వని, ఇచ్చినా ఆలీశంగా వచ్చి ఆర్టిస్టా) లేకుండాఏడిపించేవాళ్ళనిపేరుకోసం బుక్ చేసుకునివాళ్ళకిచ్చే బ్లాకూవైటూ కూడా పారేసి, ఆ వేషాలకే పదో పరకో పారేసి కొత్తవాళ్ళని బుక్ చేసుకోవచ్చు. పెద్దవాళ్ళ పేర్లుం టాయి. కొత్తవాళ్ళ మొహాలుంటాయి. ఉభయతారకం. స్టార్లుబెంగెట్టుకుంటారని బెంగక్కర్లే. ఈమధ్యనో తారన్నట్లు —వేషం ఎలా అఘోరించినా పట్టింపులేదావిడకి.

ఈ బాపతు పనికొంత ఇపుడు లాంగుషాట్లలో ఎలాగూ జరుగుతోంది. స్టాంటుబై యాక్టర్లద్వారా. ఇక మిడ్లాంగ్కీ, క్లోజపుకీ రావడం తరువాయి.

అలాగే తీరికలేని రైటర్ల సంగతీని. అండర్ గ్రవుం డులో ఉండి రాసే తీరికా, ఓపికా లేని గొప్ప రైటర్లంద రికీ డబ్బిచ్చేసి పేరు కొనుక్కుని, తరవాత వర్ధమానులకి పదో పరకో పారేసి రాయించుకోడం—వాళ్ళ పేరూ వీళ్ల రాతాను. మోతగా ఉంటుంది ఒక టెనాలీ జెంటిల్ మన్ అన్నట్టు.

ఆమాటకొస్తే ఇదీ కొత్తగాదనుకోండి. జరుగుతున్న కథగదా.

మ్యూజిక్కువిషయంలో మాత్రం ఈ పద్ధతి రివర్సులో వాడాలి. ఒక్కొక్క తెలుగు పిక్చరులో ఐదారు హిందీ హిట్ సాంగులు గుప్పిస్తున్న ప్రొడ్యూసర్లు ఆ రీరికార్డింగు పనికి కుదుర్చుకుంటున్న మ్యూజిక్కు డైరెక్టరికి ఇంకో పది వేలు పారేసి, పేరుసంగతి మర్చిపొమ్మనాలి. ఆపైన తమ పిక్చరుకి మ్యూజిక్కు డైరెక్టర్లు శంకర్—జైకిషన్, బర్మన్, రామచంద్ర అని పబ్లిసిటీ ఇస్తే బాక్సాఫీసు డ్రా ఇంకా బావుంటుంది. చిత్రగుప్త, రవి వగైరాల పాటలు పుచ్చుకున్నప్పుడుమాత్రం శంకర్-జైకిషన్, బర్మన్ అనే వేసెయ్యడం మంచిది.

ఇదీ బుద్ధిమంతుల పద్ధతి.

* * *

ఎక్సయిజుసుంకం పేరిట హాలువాళ్ళు ఆటకి రెండేసి రూపాయలు అచ్చుకోవాలని స్టూడియోలవాళ్ళు, కాదు మీారేనని హాళ్ళవాళ్ళూ అంటున్నారు. ప్రొడ్యూసరింకా ఏవీ అనకుండానే ఈ రెండువర్గాలవారూ ఇలా వ్రాటించుకోడం చూసి పెద్దతారలు కొంచెం ఖంగారు పడుతున్నారు —ఇది ఇటు తిరగదుగదా అని. మరేం ఫర్వాలేదు. తెర వేలుపులజోలికి ఎవడూ పోలేడు, మహా అయితే చిన్న నటులు భరిస్తారు దానికేం.

"అయినా కాపోయినా ఇదేవంత పెద్దకొటుత్తం గనకా వెధవ రెండు రూపాయలు. సముద్రంలో నీటి

బొట్టంతా" అన్నాడు ఒక వర్గపాయన రెండో వర్గం వాళ్ళ కేసి కోరగా చూసి.

"అదేంమాట, లిటిల్ డ్రాప్స్ జాయిన్ టుగెదర్ టు మేకె నోషన్—చిన్నచిన్న నీటిబొట్లు కలిస్తేనే సముద్రాలు తయారయేది" అన్నాడు నీటిబొట్ల విలువ తెలిసిన ధన సముద్రుడు.

మొత్తానికి మనం వీటిగురించి ఇట్టే చర్చించడం క్షేమకరంగాదు. వాళ్ళూ వీళ్ళూ కలిసి మన్నెత్తికి తోసేగల్రు.

